

యర్రపోతవరంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని యర్ర పోతవరం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టామని గురువారం గ్రామ కార్యదర్శి జయరాజ్ తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పూడుకుపోయిన డ్రెయినేజీలను శుభ్రపరచి వాటిలో పేరుకుపోయిన చెత్త తొలగించామని ఆయన తెలిపారు. అదేవిధంగా గ్రామస్తులకు తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా ఇవ్వాలని సూచించామని అన్నారు. ఈ మేరకు గ్రామపంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారని అన్నారు. అదేవిధంగా చెత్త నుండి సంపద సృష్టించే కేంద్రాన్ని సిద్ధం చేశామన్నారు. గ్రామ ప్రజలు పరిశుభ్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన వివరించారు. పరిశుభ్ర వాతావరణం ఉంటే సీజనల్ వ్యాధులు రాకుండా ఉంటాయని ఈ సందర్భంగా కార్యదర్శి సూచించారు.

కిడ్నీ రోగుల పరిస్థితి దయనీయం

- జిజిహెచ్‌లో సరైన వైద్యం కరువు
- కానరాని నెఫ్రాలజిస్ట్ నిపుణులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కొన్ని జబ్బులు శరీరకంగానే కాదు మానసికంగానూ మనుషుల్ని కుంగదీస్తాయి. అలాంటి వాటిలో కిడ్నీల వ్యాధి ఒకటి. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన సామాన్యులకు కిడ్నీల సమస్య వస్తే వీరి ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. రోజురోజుకి పెరుగుతున్న ఈ రోగులకు జిల్లా కేంద్రంలో ఉన్న కాకినాడ జిజిహెచ్‌కు తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ సరైన వైద్యం అందని పరిస్థితి నెలకొంది. అనేకేళ్లుగా సంబంధిత స్పెషలిస్ట్ డాక్టరు లేకపోవడంతో కిడ్నీ రోగుల పరిస్థితి దయనీయంగా మారింది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి, అనకాపల్లి జిల్లాల నుంచి వివిధ జబ్బులకు వైద్యం నిమిత్తం ప్రతిరోజూ 3 వేల మంది రోగులు ఇక్కడకు వస్తున్నారు. వీరిలో కిడ్నీ రోగులు కూడా అధికంగానే ఉంటున్నారు. ప్రయివేటు ఆసుపత్రులలో వేలకు వేలు సొమ్ములు చెల్లించలేని సామాన్యులు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి వస్తున్నారు. అయితే ఇక్కడ కిడ్నీ వ్యాధికి వైద్యం చేసేందుకు నెఫ్రాలజిస్ట్ లేకపోవడంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదు. దీంతో పలువురికి డయాలసిస్ చేయించుకునే స్థాయి వరకూ రోగం ముదిరిపోతుంది.

సామాన్యులకు వ్యయ, ప్రయాసలు

కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా మారింది కిడ్నీ రోగుల పరిస్థితి. జిజిహెచ్‌లో కేవలం యురాలజీ, మెడిసిన్ డాక్టర్లు మాత్రమే కిడ్నీ వ్యాధులకు కూడా వైద్యం చేయడం వలన సదరు వైద్యులపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. దీనికితోడు నయం కావాల్సిన జబ్బు మరింతగా పెరుగుతుందన్న ఆరోపణలు



వినిపిస్తున్నాయి. ఏదైనా కిడ్నీ సంబంధిత వ్యాధి వచ్చినపుడు జిజిహెచ్‌లో రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. సరైన సమాచారం ఇచ్చే నాధుడు కరువవ్వడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపున ప్రయివేటు ఆసుపత్రులలో చూపించుకుని పలువురు రోగులకు కిడ్నీ వ్యాధి ముదిరి పోవడంతో ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్ చేయించుకోవాలనిసిందిగా అక్కడి వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం 125 మంది ఇక్కడ డయాలసిస్ చేయించుకుంటున్నారు. అయితే ఖర్చుతో కూడుకున్న డయాలసిస్ కోసం అనేక మంది వ్యాధిగ్రస్తులు జిజిహెచ్‌కు తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి సరైన సమాచారం ఇవ్వడంతో ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రత్యేక వైద్యుడు అవసరం

మూత్ర పిండాలు వైఫల్యం చెందడం వలన ఈ వ్యాధి తీవ్రత అంతకంతకు పెరుగుతూ వస్తోంది. రక్తం నుంచి విష పదార్థాలు, వ్యర్థ పదార్థాలను కిడ్నీ తగిన స్థాయిలో వడపోయడంలో విఫలమైనపుడు రోగి పరిస్థితి క్షీణిస్తుంది. రెండు దశల్లో తీవ్రస్థాయి (తీవ్ర మూత్రపిండ గాయం), దీర్ఘస్థాయి (దీర్ఘ మూత్రపిండ వ్యాధి) గా మారుతుంది. ఈ నేపథ్యంలో జిజిహెచ్‌లో సంబంధిత ప్రత్యేక వైద్యుడు ఉంటే రోగ తీవ్రత స్థాయిని తగ్గించే అవకాశం ఉంటుంది. కిడ్నీ సంబంధిత వ్యాధి వచ్చినపుడు సదరు డాక్టరు పరీక్షించి వైద్యం అందించడం ద్వారా డయాలసిస్ బాధితులు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. ప్రయివేటు ఆసుపత్రులలో మినహా జిజిహెచ్‌తో పాటు జిల్లాలో ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ కిడ్నీ స్పెషలిస్ట్ లేకపోవడంతో డయాలసిస్ చేయించుకునే రోగులు అధికమై ప్రభుత్వంపై ఆర్థికంగా భారం కూడా పెరుగుతుంది. అయితే కాకినాడలోని ఒక ప్రయివేటు ఆస్పత్రి నెఫ్రాలజిస్ట్ ఇక్కడకు 15 రోజులకొకసారి వచ్చి సేవలు అందిస్తున్నారు. దీంతో అనేకమంది రోగులకు తీవ్ర అవస్థలు తప్పడం లేదు. ప్రతి రోజూ హెచ్ఐవి, హెచ్‌సివి, హెచ్‌బిఎస్ఎజి రోగులకు విడివిడిగా 20 నుంచి 30 మందికి డయాలసిస్ చేస్తున్నారు. కొన్ని సేవలకు ప్రత్యేక వైద్యులను జిజిహెచ్‌కు రప్పిస్తున్న అధికారులు కిడ్నీ వ్యాధి ప్రత్యేక డాక్టరును కూడా కనీసం వారంలో ఒక రోజయినా ఇక్కడకు రప్పించాలని రోగులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు కిడ్నీలూ దెబ్బతిని డయాలసిస్ చేయించుకుంటున్న వారి పరిస్థితి దయనీయంగా ఉంటుంది. ఎన్నో వ్యయ, ప్రయాసలు పడుతూ ఇక్కడకు వస్తున్నారు. కోనసీమ, మెట్ట వంటి సుదూర ప్రాంతాల నుంచి రావడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఇప్పటికయినా జిల్లా కలెక్టర్ స్పందించి కిడ్నీ రోగుల సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని అంతా వేడుకుంటున్నారు.

'పది' పరీక్షలు సజావుగా నిర్వహించాలి

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 1 వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జెసి టి.నిషాంతి పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం 10వ తరగతి పరీక్షల నిర్వ హణ సన్నద్ధతపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరి మొబైల్ ఫోన్‌ను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ విధించాలని చెప్పారు. జిరాక్స్, నెట్ సెంటర్లన్నీ మూయించాలన్నారు. వదంతులు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు విద్యుత్ శాఖ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. పోలీస్ శాఖ ప్రశ్నావళి జవాబు పత్రాలు తరలింపులో భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే తహశీల్దార్లు వారి సూచనల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని ఆదేశించారు. విద్యార్థులను ఉచితంగా బస్సుల్లో ప్రయాణించే ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాల రూట్లలో బస్సులు నడపాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. సమస్యాత్మకంగా గుర్తించిన పసలపూడి, మొగలి కుదురు, కొత్తపేట పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 19,217 విద్యా ర్థులకు పరీక్షలు రాయనున్నారని అన్నారు. వీరి కొరకు 110 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఒ షేక్ సలీం బాషా, పదో తరగతి పరీక్షల కంట్రో లింగ్ అధికారి హను మంతరావు డిఆర్ఒ రాజకుమారి, ఆర్‌టిసి, ట్రాన్స్‌కో, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జెసి

ధాన్యం సేకరణకు చర్యలు చేపట్టాలి

ప్రస్తుత రబీ సీజన్లో ధాన్యం సేకరణకు చర్యలు చేపట్టాలని జెసి టి.నిషాంతి లైన్ డిపార్ట్మెంట్ అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి నుండి రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ సౌరబ్ గౌర్, మేనేజింగ్ డైరెక్టర్ జిలానీలు వివిధ జిల్లాల జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రబీ సీజన్లో ధాన్యం సేకరణ, ప్రజా పంపిణీ వ్యవస్థ, దీపం-2 పథకాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జెసి లైన్ డిపార్ట్మెంట్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాబోయే రబీ సీజన్ లో ధాన్యం సేకరణ కొరకు పటిష్టమైన చర్యలు చేప ట్టాలని ఆదేశించారు. శాఖల వారీగా ధాన్యం సేకరణకు అవసరమైన మౌలిక సదుపాయాలు స్థితిగతులను శాఖల వారీగా సమీక్షించి ఇంకా అవసరమైన సౌకర్యాలపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం.బాల సరస్వతి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ.ఉదయభాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, పౌర సరఫరాల సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ ఎడి కె.విశాలాక్షి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి, జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

విద్యార్థి దశలోనే భవిష్యత్తు లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని సాధనకు విద్యార్థులు కషి చేయాలని సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్ సూచించారు. భీమనపల్లి శ్రీ శిరంగు రంగనాయకమ్మ జడ్‌పి ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులు ఫేర్ వెల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో హెచ్‌ఎం,నూకల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పదో తరగతి పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా చదువుకొని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ గుర్లింక చిన్న, గ్రామ పెద్దలు మంచెం బాబి, రమణ, పీడీ కామన మధుసూదనరావు, ఉపాధ్యాయులు ఆరవ నాయుడు, రాయి వెంకటేశ్వరరావు, నడింపల్లి పద్మనాభన్, కరాటం ప్రసాద్, ముత్యాల నరసింహమూర్తి, పెండ్యాల శ్రీనివాస్ సుబ్బారావు, లక్ష్మి, శారద, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.



ఫేర్‌వెల్ కార్యక్రమంలో పాల్గొన్న టెన్త్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ర్యాలి గ్రామంలో సాంగ్ అఫ్ జాయ్ స్కూల్ నందు ఘనంగా సైన్స్ ఎగ్జిబిషన్ గురువారం నిర్వహించారు. విద్యార్థులు అనేక సైన్స్ ప్రాజెక్ట్‌లు చేసి ఆకట్టుకున్నారు. నేషనల్ సైన్స్ డే సందర్భంగా ఈ కార్యక్రమాన్ని స్కూల్ యాజమాన్యం నిర్వహించింది. విద్యార్థులు చేసిన సైన్స్ ప్రాజెక్ట్ లను చూసి స్కూల్ డైరెక్టర్ పిఎస్.రెడ్డి జయపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సాంగ్ అఫ్ జాయ్ స్కూల్ డైరెక్టర్ పిఎస్.రెడ్డి జయపాల్, కరెస్పాండంట్ ప్రవీణ్ పలనాటి, హెచ్‌ఎం సుష్మ, స్కూల్ స్టాఫ్ పాల్గొన్నారు..

పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని హసన్ బాద గ్రామంలో పారిశుధ్యం పై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు తెలిపారు. పొడి చెత్త , తడి చెత్త వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి కర పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ సూచన మేరకు స్వచ్ఛ హసన్‌బాదకు సహకరించాలని కోరారు. రోడ్ల పక్కన చెత్త వేయరాదని, పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణ చేస్తారని గ్రామస్తులకు తెలియజేశారు. తడి చెత్త, పొడి చెత్తతో, చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, సేంద్రియ ఎరువులను తయారు చేస్తారని వివరించారు. ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను చైతన్యపరిచారు.

డాక్టర్ భవానీశంకర్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఆలమూరు

పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత ఐదేళ్లుగా సేవలు అందించిన వైద్యాధికారి డాక్టర్ పి.భవానీ శంకర్ ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమని అఖిలపక్ష పార్టీ నేతలు గారపాటి త్రిమూర్తులు, సలాది నాగేశ్వరరావు, సంగిత సుభాష్, తోట భవానీ వెంకటేశ్వర్లు, నెక్కంటి సూర్య ప్రకాశరావు, నల్లా వెంకన్న అన్నారు. పెదపళ్ల పిహెచ్‌సిలో వైద్యాధికారి డాక్టర్ డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ యేడిద సత్యశ్రీ మెహర్ ప్రసాద్ అధ్యక్షతన వైద్యారోగ్య సిబ్బంది గురువారం వీడ్కోలు సభ ఏర్పాటుచేశారు. భవానీ శంకర్ ఇటీవల బదిలీపై రాజమహేంద్రవరం వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పెదపళ్ల వైద్యాధికారిగా పనిచేసింది కొద్ది కాలమే అయినా ప్రజలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. అనంతరం అఖిలపక్ష పార్టీ నేతలు, వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది భవానీ శంకర్‌కు పూలమాలలు వేసి శాలువా కప్పి మెమెంటో బహూకరించి ఘనంగా సత్కరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎవివి.రాజా అక్కుల, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, హెల్త్ అసిస్టెంట్ వి.సుబ్బారావు, ఆర్.నాగేశ్వరరావు. టి.రామన్, ఎ.సత్యనారాయణరావు, కెవివి ఎస్ఎన్.రావు, ల్యాబ్ టెక్నీషియన్ పి.రాజా రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ భవానీ శంకర్‌ను సత్కరిస్తున్న నేతలు

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



మేడిచర్లపాలెంలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - రాజోలు

మలికిపురం మండలంలోని మేడిచర్లపాలెంలో గురువారం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండల పశు సంవర్ధశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధిటీకాల కార్యక్రమాన్ని అమలాపురం ఉపసంచాలకులు డాక్టర్ కెఎస్‌వివిఎస్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఒక్కటే మార్గమన్నారు. ఈవ్యాధి నివారణకు సంబంధించి పశువులకు టీకాలు వేయడం ఎంతో ఉపయోగమన్నారు. అలాగే వ్యాధిసోకిన పాడి పశువుల్లో తగ్గేపాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు. ఈ వ్యాధి సోకిన పశువులలో పాలు దిగుబడి పూర్తిగా తగ్గిపోకుండా ముందు జాగ్రత్తగా ప్రతి పశువులకు టీకాలు వేయవలసిన అవసరం ఉందన్నారు అలాగే డాక్టర్ డి.శివకుమార్ మాట్లాడుతూ ఆపత్కాలంలో రైతులకు దేమంగా ఉండటానికి పాడిపశువులకు తప్పనిసరిగా ప్రభుత్వ ఇన్సూరెన్స్ 80 శాతం రాయితీలో చేయించుకోవాలన్నారు అయితే ఇన్సూరెన్స్ ప్రీమియం 1920 గాను రైతు రూ.398 చెల్లిస్తే సరిపోతుందన్నారు. మేలు జాతి పశువులకు లక్ష రూపాయలు వరకు భీమ సౌకర్యం కలదు. ఈ కార్యక్రమంలో రైతులు బి.ఆది సత్యనారాయణ, పి.సత్యనారాయణ, కె.సుధాకర్, ఎం.సత్యనారాయణ సిబ్బంది ప్రేమ్ రవిబాబు పాల్గొన్నారు. **ఆలమూరు:** పాడి రైతులు ఉచిత పశు వైద్య సేవలు వినియోగించుకోవాలని మండపేట ఎస్ఎహెచ్‌డిసి డిప్యూటీ డైరెక్టర్ .గణపతి రావు, ఆలమూరు ఎడి డాక్టర్ ఎల్.అనిత, మండపేట ఎడి డాక్టర్ ఎస్.ప్రశాంతి అన్నారు. మడికి శివారు చిలకల పాడు వినాయకుని గుడి సమీపంలో మండపేట ఎస్ఎహెచ్‌డిసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య ఆరోగ్య రక్షణ శిబిరాన్ని గురువారం వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపశుసంతతి పురోభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ పశు వైద్య శిబిరంలో సుమారు 100 పశువులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్‌తో గర్భ నిర్ధారణ, గర్భకోశ సంబంధిత వ్యాధులు వంటి వాటికి వైద్యులు ప్రత్యేక పరీక్షలు చేశారని వారు తెలిపారు. అలాగే గాలికుంటు వ్యాధి నివారణకు, వివిధ జంతువులకు సోకే వ్యాధులకు సంబంధించి నిరోధక టీకాలు వేసి సలహాలు సూచనలు అందజేశారు. ఇందులో భాగంగా మండపేట నుంచి15 మంది ట్రైనీ వైద్యులు పాల్గొని ప్రత్యేక వైద్య సేవలు అందజేశారు. అనంతరం పాడి రైతులకు వారంతా పశువుల ఆరోగ్య రక్షణకు సంబంధించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో కూటమి నాయకులు దొండపాటి సుబ్బ రాజు, కొత్తపల్లి నగేష్, కొత్తపల్లి కృష్ణ, ఈదల రమేష్, పాలూరి బుల్లబ్బాయి, పశు వైద్యులు డాక్టర్ డి.వినోద్ కుమార్, డాక్టర్ జి.భాను ప్రసాద్, మండపేట పశు వైద్యులు డాక్టర్ ఏజిఎన్వి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు..



మడికిలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిడి గణపతిరావు

ఉపాధి పనుల వేగవంతానికి చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

ఉపాధి కూలీలకు నూరు రోజుల పని దినాలు సక్రమంగా కల్పిస్తూ పనులు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ ఐ.రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు, సీనియర్ మేట్లకు గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జరుగుతున్న పనులపై ఆరా తీసి, వెనుకబడిన పనులను వేగవంతం పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి గ్రామంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్క్‌లకు చెందిన షెడ్ల నిర్మాణాలలో జాప్యాలు వహించవద్దన్నారు. మండలంలో అత్యధికంగా రైతాంగం వరి సాగు చేస్తున్నారని వారికి నీటి ఎద్దడి లేకుండా పంట బోదెలు, పంట కాలువలు పరిశుభ్రతకు నిత్యం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎప్పటికప్పుడు జరిగిన పనులపై రికార్డులను తయారు చేస్తూ మీ ఉపాధి అధికారులకు అందజేయాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ అరుణకుమారి, ఇన్‌ఛార్జి ఇంజినీరింగ్ కన్సల్టెంట్ ప్రకాష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి మెట్లు, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

స్వయం ఉపాధి పథకాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 22 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఎల్‌పిఒ ఎంపిడిఒ ఐ.రాజు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగా మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. 2024 - 25 ఏడాదికి గాను వెనుకబడిన తరగతులు ఆర్థికంగా వెనుకబడిన వివిధ సామాజిక వర్గాల వారికి ప్రభుత్వం బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ లోన్లు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో బి ఫార్మసీ, డి ఫార్మసీ విద్యార్హత ఉన్న యువత తో పాటుగా దుస్తుల అల్లిక, కమ్మరి, కుమ్మరి, మేదర వంటి సామాజిక వర్గాల సంక్షేమం కోసం సబ్సిడీ లోన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కాపు సామాజిక వర్గం వారికి ఎంఎస్ఎంఇ పథకం ద్వారా చిన్న పరిశ్రమలు స్థాపించుకొనుటకు సబ్సిడీ లోన్లు మంజూరు కొరకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు తెలిపారు. అలాగే పైన తెలిపిన తరగతుల మహిళల అభ్యున్నతి కోసం ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు 18 నుంచి 50 ఏళ్ల లోపు వయసు వారికి, ఆధార్ కార్డు, మొబైల్, వైట్ రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు మీసేవ ద్వారా గాని, స్థానిక సచివాలయంలో గాని ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమానాల నివృత్తి కోసం మండల పరిషత్ కార్యాలయంలో సాంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్ పాల్గొన్నారు.

కళాశాలకు స్థలం కేటాయింపుపై హర్షం


ప్రజాశక్తి -ముమ్మిడివరం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అవసరమైన స్థలం కేటాయిస్తూ జిఒ.తీసుకురావడం హర్షణీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక డాక్టర్ ఎంజిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అవసరమైన భవనాల నిర్మాణానికి అవసరమైన 3.20 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయిస్తూ జిఒ నెం.84 తీసుకురావడంలో ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు గత రెండు సంవత్సలుగా చేసిన కృషిని ఆయన కొనియాడారు. గురువారం ఎంఎల్‌ఎ క్యాంప్ కార్యాలయంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజును కలిసి దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్య క్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



ఎంఎల్‌ఎ సుబ్బరాజును సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

కార్టూ'నిజం'



అంగన్‌వాడీల హామీలను నెరవేర్చని ప్రభుత్వం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం



గెడ్డం సురేష్ బాబు

అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీల అమలులో విఫలమైందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గెడ్డం సురేష్ బాబు విమర్శించారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తమ గోడు వినిపించాల నుకున్న అంగన్ వాడలను ఎక్కడి కక్కడ నిర్బంధించడం ప్రభుత్వ నిరంకు శత్వానికి నిదర్శనమని సురేష్‌బాబు మండిపడ్డారు. అంగన్‌వాడీల గొంతు నొక్కి ఆందోళనలను అణిచివేయడం కూటమి ప్రభుత్వ నియంత చేష్టలకు పరాకాష్ట అన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లు పూర్తిగా న్యాయ బద్ధమైనవని వెంటనే వారిని పిలిచి ప్రభుత్వం చర్చించాలని డిమాండ్ చేశారు. అంగన్ వాడీలకు నెలకు గౌరవ వేతనం రూ.26వేలు ఇవ్వాలని, తక్షణం గ్రాట్యుటీ చెల్లింపు హామీని అమలు చేయాలని, మినీ అంగన్ వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల పదోన్నతిపై నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని, పెండింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విధి నిర్వహణలో అంగన్ వాడీలు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగంతో పాటు మట్టి ఖర్చుల కింద రూ.20వేలు ఇవ్వాలన్నారు. వీటితో పాటు ఇతర 12 డిమాండ్లపై ప్రభుత్వం సాను కూలంగా స్పందించాలని, ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే దీనిపై ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యంత్రాంగం

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

ఐ.పోలవరం: నూతనంగా నిర్మించుచున్న 11 కెవి లైను నిర్మాణ పనులు నిమిత్తం ఐ.పోలవరం మండలంలో ఉన్న సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11 కెవిఆర్‌డబ్ల్యూ ఎస్ ఫీడర్, 11 కెవి గుత్తెనదీవి ఫీడర్ సరఫరాను శుక్రవారం నిలిపివేస్తారని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/ 11 కెవి గుత్తెనదీవి లైన్ ట్రీ కటింగ్, మరమ్మతుల నిమిత్తం పాతఇంజరం, ఎదుర్లంక, గుత్తెనదీవి, గోగుల్లంక, జి.వేమవరం, జి.మూలపాలెం, ఎర్రగరువు, చిన్న కొడప గ్రామాలకు, దుప్పులంక, జి.వేమవరం ఏటిగట్టు ఆక్వా చెరువులకు, గూణకాలువ గట్టు, చెరువులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఆయన తెలిపారు. **కొత్తపేట:** ట్రీ ట్రిమ్మింగ్, లైను మరమ్మతుల నిమిత్తం కొత్తపేట సెక్షన్. నందు శుక్రవారం 11 కెవి పలివెల ఫీడర్ గల ఖండ్రిగ, అవిడి, కొత్తపాలెం, కొత్తపేట మండలం పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా లోఅంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు గురువారం ప్రకటనలో తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానం శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు శివకోటి వాసులు ఆరుమెల్లి వెంకట సత్యనారాయణ మూర్తి, జ్యోష్ణ దేవి కుటుంబ సభ్యులు గురువారం స్వామివారిని దర్శించుకుని రూ.1,00,116 విరాళంగా అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.



దాతలకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

జనసేన ఆవిర్భావ దినోత్సవం జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - మామిడికుదురు

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని పి.గన్నవరం ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరం హైస్కూల్ సెంటర్‌లో గురువారం స్థానిక నాయకులు, కార్య కర్తలు, అభిమానుల మధ్య జనసేన జెండాను ఎంఎల్‌ఎ సత్యనారాయణ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ స్థాపన లక్ష్యాలను, ప్రజా సంక్షేమం కోసం పార్టీ చేస్తున్న కృషిని గుర్తు చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత అందరి మీద ఉందని, సమాజ మార్పులో జనసేన పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని, జనసేన పార్టీకి తమ మద్దతును తెలిపారు. కార్యక్రమంలో పెదపట్నం సర్పంచి గుబ్బల దుర్గ, నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి, మండల జనసేన అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజ తదితరులు పాల్గొన్నారు



పార్టీ శ్రేణులతో ఎంఎల్‌ఎ సత్యనారాయణ సమావేశం

'పది' పరీక్షలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ డాక్టర్ సలీం బాషా

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అందరూ సమిష్టిగా పని చేసి పది పబ్లిక్ పరీక్షలను విజయవంతం చేయాలని డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల జిల్లా కార్యాలయాల ప్రాంగణంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం నందు గురువారం వివిధ ఉపాధ్యాయ సంఘాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డిఇఒ డాక్టర్ బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలను ఉపాధ్యాయుల సహకారంతో సమర్ధవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పరీక్షలను నిర్వహించడం ద్వారా జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మంచి పేరు తీసుకుని రావాలన్నారు. అలాగే పరీక్ష పేపర్ల మూల్యాంకనంలోనూ ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించే విధంగా ఉపాధ్యాయ సంఘాలు తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. ఉపాధ్యాయులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండే విధంగా ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానని డాక్టర్ బాషా హామీనిచ్చారు. విద్యాపరంగా జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయ సంఘాలు తమ వంతు కృషి చేయాలని, జిల్లా విద్యాశాఖకు సమిష్టి సహకారం అందించాలన్నారు. సమావేశంలో పరీక్షల విభాగం ఎసి బి.హనుమంతరావు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి జరిగే పది పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పరీక్ష పేపర్లు జిల్లా కేంద్రం నుంచి పోలీస్‌స్టేషన్లకు పంపించామన్నారు. పరీక్ష పేపర్లు విద్యార్థులకు అందజేసే సమయంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు ఒకటికి రెండు సార్లు సరిచూసుకుని పేపర్లు ఇచ్చే విధంగా డైరక్షన్ ఇచ్చామన్నారు. జిల్లాలో 19,217 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో డివైఇఒలు జి.సూర్యప్రకాష్, పి.రామలక్ష్మణమూర్తి, పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు నక్కా సురేష్, నాగేశ్వరరావు, సమగ్ర శిక్షా ఎఫ్ఎఒ జి.ప్రవీణ్‌కుమార్, అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు, డిఇఒ కార్యాలయ ఎఎస్ఒ డి.తాతారావు, యుటిఎఫ్, ఎస్‌టియు, పిఆర్‌టియు, ఆప్కోస్ తదితర ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



ప్రమాద ఘటనా ప్రాంతం

రోడ్డు ప్రమాదంలో నానమ్మ, మనవడు మృతి

ప్రజాశక్తి -దేవరపల్లి, గోపాలపురం

మండలంలోని దుద్దుకురు ఫ్లైఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాలపురం గ్రామానికి చెందిన నానమ్మ, మనవడు షేక్ మీరా తున్నీషా(65), షేక్ సమీర్(17) మృతి చెందారు. దేవరపల్లి ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల మేరకు గోపాలపురం గ్రామానికి చెందిన షేక్ మీర తున్నీసా_ సమీవుల్లా భార్యాభర్తలు. వీరి కుమార్తె అనారోగ్యంతో ఇటీవల మరణించింది. ఈ నేపథ్యంలో కీడు బట్టలు పెట్టేందుకు మీర తున్నీసాను గోవర్ధగిరిమెట్టలో ఉంటున్న సోదరుడు ఆహ్వానించాడు. దీంతో మీర తున్నీసా తన మనవడు షేక్ సమీర్‌ని తీసుకుని బైకుపై పంగిడి వద్ద ఉన్న గోవర్ధనగిరి మెట్టలోని తమ్ముడి ఇంటికి వెళ్లింది. కార్యక్రమం ముగించుకుని తిరిగి గోపాలపురం పయనమయ్యారు. దుద్దుకూరు వద్దకు వచ్చేసరికి లారీని వెనకవైపు బలంగా వీరి బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో రాజమండ్రి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. దీంతో గోపాలపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమీరం స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ సిఇసి ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తున్నాడు. శనివారం ఒక పరీక్ష రాస్తే ఇంటర్మీడియట్ పూర్తవుతుందనకున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసకుంది. సమీర్ తండ్రి రియాజ్ వడ్రంగి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సెలవు రోజుల్లో సమీర్ తండ్రికి చేదుడు వాదోడుగా ఉంటున్నాడు. గురువారం పరీక్షకు సెలవు కావడంతో తన నానమ్మను తీసుకుని వెళ్తుంగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ఆక్సిజన్ అందక శిశువు మృతి

ప్రజాశక్తి - కొత్తపేట

ఆక్సిజన్ అందక మూడురోజుల నవజాత శిశువు గురువారం మృతి చెందింది. దీనిపై ఆసుపత్రి వద్ద శిశువు కుటుంబ సభ్యులు, బంధువులు అందోళన చేశారు. వివరాలు ఇవి. .రావులపాలెం కొత్త కాలనీకి చెందిన మార్గాని వీరబాబు, భార్య కనకమహాలక్ష్మి దంపతులకు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రెండవకాన్పులో మగబిడ్డ జన్మించింది. శిశువు కు గురక వస్తుందని కొత్తపేట శివారు పోస్ట్ ఆఫీస్ సమీపంలోని ఒక ప్రయివేటు చిన్నపిల్లల ఆసుపత్రిలో చేర్చాలంటూ వైద్యులు సూచించారు. ఈమేరకు మంగళవారం చేర్పించినట్లు సమాచారం. చికిత్స అనంతరం గురువారం పంపిస్తామని చెప్పిన ఆసుపత్రి సిబ్బంది తండ్రి వీరబాబుకు ఫోన్ చేసి శిశువుకు సీరియస్‌గా ఉందని రాజమహేంద్రవరంలోని చిన్నపిల్లల ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిసింది. గురువారం రాజమహేంద్రవరంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రి వైద్యులు శిశువును పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించినట్లు శిశువు బంధువులు తెలిపారు. బుధవారం రాత్రి శిశువుకు సిబ్బంది ఆక్సిజన్ అందించడంలో నిర్లక్ష్యం వహించారని శిశువు తల్లిదడులు, బంధువులు ఆరోపించారు. దీంతో గురువారం చిల్డ్రన్స్ హాస్పిటల్ ఎదురుగా ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని తండ్రి, వైద్యులను వివరాలు తెలుసుకుని విచారిస్తున్నారు. అయితే ఈ ఆసుపత్రిలో వైద్యం సరిగా అందక గతంలో కూడా కొంతమంది శిశువులు చనిపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

రోడ్డు ప్రమాదంలో గురువారం వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. రావులపాలెం మండలం లక్ష్మీపోలవరం గ్రామానికి చెందిన అరుగుల చంద్రరావు(83) కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం మండలంలోని ర్యాలి గ్రామంలో బంధువుల ఇంటి లో జరుగుచున్న కార్యక్రమానికి లక్ష్మీ పోలవరం నుంచి నడుచుకుంటూ ర్యాలి గ్రామం వస్తున్నాడు. ఈ సమయంలో జిమ్ సెంటర్ వద్దకు వచ్చేసరికి కృషి ట్రాక్టర్ అతి వేగంతో చంద్రరావును వెనుక వైపు నుండి ఢీకొంది. ఈ ఘటనలో రోడ్డు మీద పడి అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చంద్రరావు మనవడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండలంలోని నర్సిపూడిలో నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల నాటు సారాతో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ ఐడి.నాగేశ్వరరావు తెలిపారు. నాటు సారా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో నర్సిపూడికి చెందిన గుత్తుల సుబ్బారావు 20 లీటర్లు నాటు సారాతో పట్టుబడ్డాడన్నారు. అతనిని నుంచి స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసి ఆలమూరు కోర్టులో హాజరుపరచామన్నారు. నిందితుడు సుబ్బారావుకు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ రాంబాబు తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ప్రజాశక్తి - సీతానగరం

అదనపు కట్నం కోసం వేధింపులపై వివాహిత సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం గ్రామానికి చెందిన సిహెచ్.మోహన రావు కుమారుడు వెంకటేష్‌తో రఘుదేవపురం గ్రామానికి చెందిన సృజనకు 2021లో వివాహం అయ్యింది. కొంత కాలం వారి కాపురం సజావుగానే సాగింది. ఇటీవల కొన్ని నెలలుగా భర్త వెంకటేష్, అత్త సదాలక్ష్మి, ఆడపడుచు దుర్గ ఆమె భర్త పాలిశెట్టి రఘుబాబు అదనప కట్నం తీసుకురావాలంటూ వేధిస్తున్నారు వేధింపులు తట్టుకోలేక ఆమె పుట్టింటికి వచ్చేసింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - మండపేట

విద్యార్థులంతా ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలకు హాజరై నూరు శాతం ఉత్తీర్ణత సాధించి, పాఠశాల కు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వెలగతోడు గ్రామ సర్పంచ్ నలమామిడి కృపరాజు, గ్రామ పెద్దలు ఈదల వీరాస్వామి అన్నారు. వెలగతోడు జడ్‌పి ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు విద్యాదాత ఈదల వీరాస్వామి గురువారం పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ రెడ్డి సురేష్, వైస్ ఛైర్మన్ పిల్లిల్లి మమత, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, వీరభద్రరావు, అలీ, శ్రీనివాస్, సఫీర్, ఏసు రాజు, సాయి పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టీల్ బాటిల్స్ అందజేసిన దాత సతీష్

విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని సందిపూడిలో ఎంపీపీ పాఠశాలలో గురువారం ప్లాస్టిక్ బాటిల్ వద్దు స్టీల్ బాటిల్స్ ముద్దు అని దాత సూరపురెడ్డి సతీష్ అంటూ తన సౌజన్యంతో కొనుగోలు చేసిన స్టీల్ బాటిల్స్ ను విద్యార్థులందరికీ అందజేశా రు. ఈ సందర్భంగా హాజరైన సర్పంచ్ తోట భవాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్టీల్ బాటిల్ యొక్క ఉపయోగాలు, ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్ధాలను విద్యార్థులకు వివరించారు. దాత సూరపురెడ్డి సతీష్ ను ఈ సందర్భంగా అందరూ అభినందించి, ఆయనకు చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ గుత్తుల దుర్గాప్రసాద్, వైస్ చైర్మన్ ముచ్చర్ల రత్నకుమారి, ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు బి లోకేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాఠశాలలో హోలీ వేడుకలు

ప్రజాశక్తి - మండపేట

స్థానిక సంగమేశ్వర కాలనీ ప్రాథమిక పాఠశాలలో హోలీ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తమ స్నేహితులు, ఉపాధ్యాయులకు రంగులను చల్లుతూ ఒకరికి ఒకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముత్యాల మాణిక్యాంబ, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దామోదరం సంజీవయ్య పుస్తకావిస్కరణలో గొల్లపల్లి తదితరులు

సంజీవయ్య జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి - అంబాజీపేట

ఉమ్మడి ఎపి మాజీ సిఎం దామోదరం సంజీవయ్య జీవితం ఆదర్శనీయమనిమాజీ మంత్రి, వైసిపి రాజోలు నియోజకవర్గ సమన్వయకర్త గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సంజీవయ జీవిత చరిత్రను గ్రంథస్థం చేసిన వైసిపి రాష్ట్ర నాయకులు నేలపూడి స్టాలిన్ బాబు సామాజిక సృహను అభినందిస్తున్నానని సూర్యారావు అన్నారు. గురువారం అంబాజీపేట లోని స్టాలిన్ బాబు స్వగృహం వద్ద ఆయన పుట్టినరోజు వేడుకల్లో భాగంగా జరిగిన కార్యక్రమానికి గొల్లపల్లి పాల్గొని మాట్లాడారు. స్టాలిన్ బాబు జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. స్టాలిన్ బాబు రచించిన 'చిరస్మరణీయుడు దామోదరం సంజీవయ్య' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వైసిపి మండల శాఖ అధ్యక్షులు విత్తనాల ఇంద్ర శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంబాజీపేట జడ్‌పిటిసి సభ్యులు బూడిద వరలక్ష్మి, ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపిటిసిల సమాఖ్య అధ్యక్షులు మొత్తాబత్తుల ప్రశాంత్, అయినవిల్లి మండల పార్టీ అధ్యక్షులు కుడిపూడి విద్యాసాగర్, మామిడి కుదురు ఎంపిటిసిల సమాఖ్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్, జి తదితరులు పాల్గొన్నారు.



మృతురాలి చిత్రపటం వద్ద మాజీ ఎంపీ జివి.హర్ష కుమార్ నివాళి

ఎంపిపి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - కాట్రేనికోన

స్థానిక మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు పాలెపు లక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులను అమలాపురం మాజీ ఎంపీ జివి.హర్ష కుమార్ పరామర్శించారు. గురువారం పల్లం గ్రామంలోని ఎంపిపి ఇంటికి వెళ్లి ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమె భర్త ధర్మరావును కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమలలో సర్పంచ్‌లు మాల్లాడి వీర బాబ్జి, మల్లాడి ఏడు కొండలు, నాయకులు నల్లా నరసింహ మూర్తి, ఓలేటి సతీష్, మల్లాడి నారాయణ రావు, పట్టా రమేష్, కోలాటి సత్యం, రేవు ధర్మారావు, దాసరి కాసుబాబు, సంగాని చిన్ని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తదితరులున్నారు.

పలువురికి సూర్యప్రకాష్ పరామర్శ

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలం లోని అద్దంపల్లి గ్రామంలో పిల్లి బవనారాయణ తండ్రి ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను రామచంద్రాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పిల్లి సూర్య ప్రకాష్ పరామర్శించి సంతాపం తెలిపారు. అదేవిధంగా సత్యవాడ గ్రామంలో పలువురిని ఆయన పరామర్శించారు. ఆయనతోపాటు గ్రామ సర్పంచ్ చింతపల్లి లక్ష్మి, వెంకట రమణ, చింతపల్లి సతీష్ కుమార్, చొడి రాంబాబు, పాల శ్రీను, గుబ్బల శ్రీను కోశెట్టిసత్తిబాబు, గీసాల గోపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వస్తువుల కొనుగోలులో ఇబ్బందులు వస్తే నష్టపరిహారం

ప్రజాశక్తి - కె.గంగవరం

వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువులు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే అతను నష్టపరిహారం కూడా అందుకోవచ్చని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అడపా ఉదయ ప్రసాద్ వివరించారు. మండల కేంద్రం కె.గంగవరం ఉన్నత పాఠశాలలో గురువారం వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన చైతన్య సదస్సు లో కోనసీమ జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుడు అద్దంకి పరమేశ్వరరావు మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. పరమేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారుల హక్కుల రక్షణకు ప్రతి రోజు తాము కృషి చేస్తున్నామన్నారు. ఎవరికైనా సేవాలోపం జరిగితే ఆ విషయాన్ని తమకు నేరుగా తీసుకురావచ్చునని వివరించారు. విద్యార్థులే సారధులు అందరి లో చైతన్యం కలిగించాలని ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ఉదయ ప్రసాద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమాలలో పివి.బ్రహ్మానందం, జి.ఏడుకొండలు, పితాని శ్రీనివాసు,నండూరి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

జర్మనీలో ఉద్యోగాలకు శిక్షణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జర్మనీ భాష శిక్షణతో పాటు ఆదేశంలో మెక్ట్రోనిక్స్‌లో ఉద్యోగాల కొరకు అవసరమైన శిక్షణ పొందేందుకు రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి డి.హరిశేషు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జర్మన్ భాష పాటు మెక్ట్రోనిక్స్ ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రత్యేక కార్యక్రమానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు మార్చి 25 లోపు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మెక్ట్రోనిక్స్, ఎలక్ట్రికల్, ఎనర్జీ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ లో డిగ్రీ డిప్లమో పూర్తి చేసి 18 - 40 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. కనీసం మూడేళ్ల అనుభవం అవసరమని, ఆరు నెలల పాటు శిక్షణ ఇస్తారన్నారు. రెండేళ్లు జర్మనీలో పనిచేయాలిసి ఉంటుందని, నెలకు 2008 నుంచి 3600 యూరోలు అనగా భారత కరెన్సీ లో సుమారు రూ.2,52,658 నుంచి రూ.3,24,846 వరకు ఉంటుందన్నారు.అంతే కాకుండా https://naipunyam.ap.gov.in//rogram-registration వెబ్ సైట్ లోను దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.



భవిత విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న యంత్రాంగం

వికలాంగుల సమస్యలపై స్పందించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

వికలాంగుల సమస్యల పైన ప్రతి ఒక్కరు స్పందించాలని పారా సంస్థ డైరెక్టర్ థామస్ పల్లిథానం, ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ, ఎంపిడిఒ ఐ.రాజు, ఎంఇఒ బి.అప్పాజీ అన్నారు. గురువారం పారా సంస్థ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని భవిత కేంద్రము నందు కేర్ గివెర్స్ ట్రైనింగ్ ప్రొగ్రామ్ ను విభిన్న ప్రతిభావంతుల కోఆర్డినేటర్ బడుగు మహిమరావు ఏర్పాటు చేశారు. అదేవిధంగా విభిన్న ప్రతిభావంతుల హక్కుల సాధకురాలు బడుగు సుబ్బాయమ్మ రిసోర్స్ పర్సన్గా హాజరయ్యి విభిన్న ప్రతిభావంతులకు ఉన్నటువంటి హక్కులు, సంక్షేమ పథకాలు అవగాహన కల్పించారు. ఈ సంద్భంగా వారంతా మాట్లాడుతూ వికలాంగు సమస్యలను ఉన్నత అధికారులకు తెలియజేస్తామన్నారు. భవిత సెంటర్లో అవసరమైన డ్రింకింగ్ వాటర్ మొదలైన పనులను త్వరలో పూర్తి చేస్తామని హామీ వారు ఇచ్చారు. అనంతరం వారు పిల్లలకు కావలసిన టిఎల్ఎం కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌టి టీచర్ విజయ కిరణ్, స్థానిక బ్లాక్ కోఆర్డినేటర్ జి.దుర్గ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంకన్నను దర్శించుకున్న ఎంఎల్‌సి సోము వీర్రాజు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని గురువారం ఎంఎల్‌సి సోము వీర్రాజు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు మర్యాదలతో స్వామివారి దర్శనం చేయించి అనంతరం తీర్థప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటం అందజేశారు. అలాగే రావులపాలెం మండలం ఉబలంకకు చెందిన మేడపాటి అశ్వినిరెడ్డి, వారి కుటుంబ సభ్యులు శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి రూ.1,01,116 విరాళాన్ని ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరావుకు అందజేశారు.

సౌర విద్యుత్‌కు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

సౌరవిద్యుత్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్యచౌదరి అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ,లలో అగ్రశ్రేణి సోలార్ కంపెనీగా రాణిస్తూ, దేశంలో సోలార్ పరిశ్రమలలో రెండవ కంపెనీగా ఉన్న ఫ్రేయర్ ఎనర్జీ తమ తాజా రూఫ్‌టాప్ సోలార్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను రాజమండ్రి నెలకొల్పింది. దీన్ని ఎంఎల్ఎ గోరంట్ల గురువారం ప్రారంభించారు.ఫ్రేయర్ ఎనర్జీ మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ మార్హా, డైరెక్టర్ రాధిక చౌదరి, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు సౌరభ్ మార్హా మాట్లాడుతూ 'సౌర వ్యవస్థలో పెట్టుబడి పెడితో 25 నుంచి 30 సంవత్సరాల వరకు ప్రయోజనం పొందొచ్చన్నారు.